క్లుప్తంగా

31 మంది ఉపాధ్యాయుల బదిలీ

రోలుగుంట : మండలం నుంచి సర్వీసు కాలం పూర్తయిన సుమారు 31 మంది ఉపాధ్యాయులు బదిలీ అయినట్టు మండల విద్యాశాఖాధికారి జాను ప్రసాద్ తెలిపారు. బదిలీ అయిన వారిలో మండలం నుంచి 21 మంది ఎస్‌జీటీలు, ముగ్గురు పీఈటీలు, ఏడుగురు స్కూలు అసిస్టెంట్లు ఉన్నట్టు ఆయన మంగళవారం చెప్పారు. అలాగే ఇప్పటి వరకూ ఇన్‌చార్జి హెచ్‌ఎంతో కొనసాగుతున్న కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్తి స్థాయి హెచ్‌ఎం, పోస్టు మంజూరైందన్నారు. మన మండలానికి బదిలీల్లో భాగంగా పొరుగు మండలాల నుంచి 30 మంది ఎస్జీటీలు వచ్చారన్నారు. కొన్ని పాఠశాలల్లో ఉన్న వేకెన్సీలను భర్తీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి నివేదించడం జరిగిందని తెలిపారు.

వరి విత్తనాలకు నమోదు చేసుకోండి

మాకవరపాలెం: రైతులు వరి విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో డి.అప్పారావు తెలిపారు. మండలంలోని గిడుతూరు, కొండల అగ్రహారంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీపై పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించే జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను అందిస్తున్నామన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు కావాల్సిన రకాల వరి విత్తనాలకు రైతు సేవా కేంద్రాల్లో ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుతో భూ సారం పెరుగుతుందన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గవిరెడ్డి వెంకటరమణ



నర్సీపట్నం : నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్సీపట్నం మున్సిపాలిటీ, బలిఘట్టంకు చెందిన గవిరెడ్డి వెంకటరమణను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. ప్రస్తుతం మున్సిపాలిటీ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీకి ఆయన సేవలను గుర్తిస్తూ పార్టీ అధిష్టానం ఆయనకు సముచిత స్థానం కల్పించారని పార్టీ వర్గాల్లో చర్చించుకుంటున్నారు.

సంక్షేమ పథకాలు వర్తింప జేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు

నర్సీపట్నం : స్వచ్ఛ భారత్ మిషన్‌లో పనిచేస్తున్న ఎంఆర్పీ(మండల రిసోర్స్ కోఆర్డినేటర్లు)లకు తల్లికి వందనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఎంఆర్పీలకు వర్తింపజేయాలన్నారు. ఆప్కాస్‌లో ఔట్‌సోర్సింగ్‌లో వీరిని నియమించడం జరిగింది. నెలకు రూ.11,324 చెల్లించాల్సి ఉండగా, ప్రతి నెలా చెల్లించడం లేదన్నారు. సంక్షేమ పథకాలు లేక వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఐటీయూ నాయకులు చిరంజీవి, బుంగా గంగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వభూమిలో హెచ్చరిక బోర్డులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల పెదమదీన గ్రామంలో ఆక్రమణలను తహసీల్దార్ లక్ష్మి తొలగించారు. గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 81 ప్రభుత్వ భూమిని ఆక్రమించడంపై గ్రామస్తులు తహసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మి,ఆర్ఐ శ్రావన్‌కుమార్,వీఆర్వో పణవీ ఆక్రమణ భూమిని మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా గుర్తించి తహసీల్దార్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

పొలం పనులు చేస్తుండగా రైతుకు పాముకాటు

రావికమతం : పాముకాటుకు గాయపడిన సంఘటన మేడివాడలో గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్లి సాయికిరణ్ పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేసింది.అక్కడే ఉన్న రైతులు గమనించి రావికమతం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

అనకాపల్లి టౌన్: చాకచక్యంగా ద్విచక్ర వాహనాలు తస్కరిస్తున్న దొంగను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశామని పట్టణ క్రైం ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు మంగళవారం తెలిపారు. పట్టణ సీఐ టి.వి. విజయ్‌కుమార్ పర్యవేక్షణలో తుమ్మపాల ఏలేరు కాలువ వద్ద సోమవారం నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. చీడికాడ మండలం, అదే గ్రామానికి చెందిన మాకాల ధనకుమార్ పరవాడ కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడన్నారు. ఇతను ఇటీవల వేల్పులవీధి రాఘవేంద్రస్వామి గుడి వద్ద ఇంటి ముందు పార్కు చేసిన గ్లామర్ బైక్, పూడిమడక రోడ్ రామాలయం వద్ద పార్క్ చేసిన పల్సర్ బైక్‌ను దొంగలించాడని తెలిపారు. నిందితుడు నుంచి పల్సర్ బైక్ స్వాధీనం చేసుకోని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మాకవరపాలెం కిందివీధిలో పేరుకుపోయిన చెత్త



పి.పి.అగ్రహారంలో రోడ్డు పక్కనే వేసిన చెత్త

పారిశుధ్యం తూతూమంత్రం

- స్వాగతం పలుకుతున్న చెత్త కుప్పలు
- మొక్కుబడిగా సంపద కేంద్రాల నిర్వహణ
- వ్యాధుల బారిన పడతామని స్థానికుల ఆవేదన



గిడుతూరులో పశువైద్య కేంద్రం పక్కనే పడిఉన్న చెత్త

మాకవరపాలెం : గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు ప్రజలకు స్వాగతం పలుకుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాలు కంపుకొడున్నాయి. అయినా అధికారులు వీటి నివారణ విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మండలంలోని కొండలఅగ్రహారం, బయ్యవరం, గిడుతూరు, పి.పి.అగ్రహారం, మాకవరపాలెం, తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజలు చెత్త కుప్పల కారణంగా నానా అవస్థలు పడుతున్నారు. దుర్గంధం వెదజల్లడంతో ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

కానరాని స్వచ్ఛత..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం గ్రామాల్లో చెత్తను తొలగించేలా ఆదేశాలిచ్చింది. కానీ అధికారులు దీనిని తూతూమంత్రంగానే నిర్వహిస్తున్నారు. ఎక్కడో ఓచోట ఫొటోలు తీసుకుని అయిందనిపిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడంతో పాటు మురుగుకాలువలు పూడుకుపోయి దర్శనమిస్తున్నాయి.

చెత్త సంపద కేంద్రాలు ఎందుకో..?

గ్రామాల్లో రూ.లక్షలు కేటాయించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు ఎందుకు ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో చెత్తను సేకరించి ఈ కేంద్రాలకు తరలించాల్సి ఉంది. కానీ గిడుతూరులో చెత్త సంపద కేంద్రం పక్కనే ఉన్న పశువైద్య కేంద్రాన్ని ఆనుకుని చెత్త పేరుకుపోయింది. ఇక మాకవరపాలెంలో కింది వీధిలోను, బీసీ కాలనీ, కొత్తవీధితోపాటు రాజారావుపేటలోని మార్కెట్‌లో చెత్త పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పి.పి.అగ్రహారం, కొండల అగ్రహారం, బయ్యవరం గ్రామాల్లో రోడ్లు పక్కనే చెత్త కుప్పలు పేరుకుపోయాయి. ప్రజలు చెత్తను తొలగించాలని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు అధికమైతే వీటి కారణంగా వ్యాధులు ప్రబలక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలకు వరి విత్తనాలు పంపిణీ



వరి విత్తనాలను రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు, ఎంపీపీ బుల్లిలక్ష్మి

దేవరాపల్లి : మండల వ్యవసాయ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం ఖరీఫ్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మితో కలిసి ఆయన రైతులకు విత్తనాలు అందజేశారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సాంబా మసూరి, శ్రీధృతి, అమర, సోనామసూరి, శ్రీకాకుళం సన్నాలు, స్వర్ణ వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని స్థానిక వ్యవసాయ అధికారి కాంతమ్మ రైతులకు సూచించారు. సర్పంచ్ పెంటమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మేడిచర్ల రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం ఖరీఫ్‌లో సాగుకు రాయితీపై వేరుశెనగ విత్తనాల పంపిణీతో పాటు రైతులకు పవర్ ట్రిల్లర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి వనజ, పూడి శ్రీను, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరక్టర్ రొంగలి మహేష్, దొగ్గ ఉమాశంకర్, తహసీల్దార్ భుజంగరావు, ఏవో సోమశేఖర్ పాల్గొన్నారు.

చీడికాడ: స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు మంగళవారం రైతులకు 21 పవర్ టిల్లర్లు,17 దమ్ము, దుక్కి సెట్లు, 21 బేటరీ స్ప్రేయర్లు, 3 రోటావేటర్లు, వరి విత్తనాలను అందజేశారు. ఏఓ కృష్ణవేణి, ఎంపీడీఓ హేమసుందర్‌రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభ్యులు, అధికారులు కలసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సమస్యలు లేకుండా అన్ని గ్రామాల్లో వైద్య పరీక్షలు చేస్తున్నట్టు వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు మాట్లాడుతూ గ్రామాల్లో దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేయించాలని కోరారు. ప్రతి గ్రామంలో నూరు శాతం జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించడం జరుగుతుందని ఏపీవో సూర్యమణి తెలపగా కంఠారం సర్పంచ్ బిడిజాన రాజేశ్వరి కంఠారం గ్రామ పంచాయతీలో తీర్మానం లేకుండా వీఆర్‌పీని ఎలా నియమించారో తెలపాలని డిమాండ్ చేశారు.

కూటమి పాలనలో మహిళలపై పెచ్చుమీరిన దాడులు



కె.కోటపాడులో పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఈర్లె అనురాధ, పార్టీ నాయకులు

కె.కోటపాడు : రాష్ట్రంలో మహిళలపైన దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెడుతూ డైవర్షన్ పాలిటిక్స్‌ను కూటమి ప్రభుత్వం నడుపుతుందన్నారు. కె.కోటపాడులో ఎంపీపీ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రెడ్డి జగన్మోహన్ నివాసం వద్ద మంగళవారం 'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానని ఎన్నికల్లో చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక ఏడాది కాలంలోనే ఓట్లేసిన ప్రజలకు వెన్నుపోటును పొడిచారని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి పథకాన్ని రూపకల్పన చేసి అర్హత కలిగిన ప్రతి విద్యార్థి తల్లికి ఆర్థిక సాయం అందించారని, ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ ఆస్పత్రులను నాడు–నేడు పథకం కింద కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అమ్మ ఒడి పథకానికి తల్లికి వందనం అని పేరుమార్చారని తెలిపారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ, 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 నగదును ఇస్తానని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనతో పాటు బీసీ వర్గాల వారికి 50 ఏళ్లు దాటితే సామాజిక పింఛను మంజూరు చేస్తానని చెప్పిన చంద్రబాబు దేనినీ అమలు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా రాజేష్, మండల యువజన విభాగం మండల అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, పైల కోటేశ్వరరావు, బండారు దేముళ్ళు, బోళెం సందీప్, లెక్కల పైడినాయుడు, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, చీపురుపల్లి అచ్చిబాబు, నెక్కల గోపి, బోళెం కృష్ణారావు, రొంగలి రమేష్, ఆకుల సాయి ప్రసాద్, రంధి రాజునాయుడు, బోళెం సత్యనారాయణ, మలిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాబూరావు



పెంద్రంగిలో పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న ఎంపీటీసీ నెక్కల గోపి

దేవరాపల్లి : బోయిలకింతాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భర్నికాల రత్నంతో కలిసి విద్యార్థులకు మంగళవారం వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. సత్యనారాయణ, పరమేష్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : పెంద్రంగి పాఠశాలలోవిద్యార్థి మిత్ర కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాలలో గల 62 మంది విద్యార్థులకు ఎంపీటీసీ నెక్కల గోపీ చేతుల మీదుగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం అందించారు. హెచ్‌ఎం శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : జి.అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. పాఠ్య,నోట్ పుస్తకాలు, యూనిఫాంలను సర్పంచ్ మంగమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం బంగారయ్య, పీఎంసీ కమిటీ చైర్మన్ నానాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావికమతం: దొండపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం స్కూల్ చైర్మెన్ చందక రాజేశ్వరరావు,మాజీ వైస్ సర్పంచ్ వెదురుపర్తి ఆచారి,పాఠశాల హెచ్‌ఎం బంటు అప్పారావు, ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలు,నోట్ పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు.

దస్తావేజులేఖర్లు, స్టాంప్‌వెండర్ల ఆందోళన



చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు, స్టాంప్‌వెండర్లు

చోడవరం : పేపర్‌లెస్ డాక్యుమెంట్ విధానం వద్దంటూ దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు ఆందోళనకు దిగారు. చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వీరంతా మంగళవారం నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం కొత్త విధానాలను యోచిస్తుండడంతో దీనిపై దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు వ్యతిరేకించారు. పేపర్‌లెస్ డాక్యుమెంట్ విధానం పెడితే అనేక అవకతవకలు జరిగి ప్రజలకు చాలా నష్టం, ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. ప్రజల ఆస్తులకు భద్రతపోతుందని, ఈ విధానాన్ని రద్దుచేసి డాక్యుమెంట్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆందోళనలో వడ్డాది రమేష్, కె.నారాయణరావు, బొబ్బిలి శేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు



అరాచక పాలనపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు సన్యాసిపాత్రుడు, పార్టీ నాయకులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



రావికమతంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



పుస్తకావిష్కరణలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు

నర్సీపట్నం : సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్పుతారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు అన్నారు. జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం.. అంటూ కూటమి ఏడాది పాలనలో ఆరాచకాలు, మోసాలను వివరిస్తూ ప్రచురించిన బుక్‌లెట్‌ను మంగళవారం ఆవిష్కరించారు. జగన్ ప్రభుత్వం కంటే రెండింతలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తల్లికి వందనం పేరుతో వంచన చేశారని ఆరోపించారు. మూడు సిలిండర్లు, ఉచిత బస్సు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రం, నియోజకవర్గంలో విధ్వంస పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, రూరల్ అధ్యక్షులు శానతిపతి వెంకటరత్నం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వికాస్ సతీష్, కర్రి శ్రీనివాసరావు, తమరాన శ్రీనువాసరావు, మల్ల గణేష్, టౌన్ మహిళా అధ్యక్షురాలు కణితి అన్నపూర్ణ, చిటీల రాము, బేతిరెడ్డి విజయ్, గంటా లలిత, కణితి వాసు, యలమంచిలి వేణు, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు గొంప కన్నయ్యనాయుడు, ఎంపీటీసీ బోళెం వెంకటేష్, సుర్ల శేఖర్, రాజారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

హామీలు మరిచి కక్షా రాజకీయాలు

మాకవరపాలెం: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ అన్నారు. జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని మండల వైఎస్సార్‌సీపీ నేతలతో కలసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పాలనలో అక్రమాలు, తప్పుడు కేసులు, రౌడీయిజం తప్ప ఏమీ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పిల్లా శ్రీను, వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాజారావు, పెట్ల భద్రాచలం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో మోసం..అరాచకం

గొలుగొండ : జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని గొలుగొండ మండలంకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం మండల కేంద్రంలో పుస్తకాన్ని అవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్న ప్రజలకు ఎటువంటి పనులు చేయలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు మినహా ప్రజలకు మేలు చేయలేదని నాయకులు ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు మరిచిన చంద్రబాబుకు ప్రజలే గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాజ్జి, కొరుప్రోలు ఫాణీశంతారామ్, యూత్ పార్టీ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, నల్లబెల్లి శ్రీనివాస్, పత్తి రమణ పాల్గొన్నారు.

కేసులు, వేధింపులు తప్ప అభివృద్ధి ఏదీ?

రావికమతం: ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం తప్ప కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు మేలు చేసిందేమీ లేదని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు అన్నారు. జగన్ అంటే నమ్మకం....చంద్రబాబు అంటే మోసం పేరిట వైఎస్సార్‌సీపీ రూపొందించిన పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. పుస్తక ప్రతులను పార్టీ శ్రేణులకు పంపిణీ చేసి గ్రామాల్లో ప్రజలకు వాటిని చదివి వినిపించి కూటమి ప్రభుత్వం ప్రజలకును ఎలా మోసం చేసిందో తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

నాతవరం : ప్రజలను నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబునాయుడు దిట్టని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. కూటమి నేతలు చేస్తున్న అరాచకాలు, దోపిడీని మాజీ ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైల సునీల్, గన్నవరం పీకే గూడెం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు కరక అప్పలరాజు, మంకు సాంబమూర్తి, వి.సూరిబాబు, గునుపూడి సర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వేళలు పాటించాలి

దేవరాపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయపాలన కచ్చితంగా పాటించాలని కె.కోటపాడు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో పి.లలితకుమారి సూచించారు. యలమంచిలి నుంచి ఇక్కడికి సీడీపీవోగా బదిలీపై వచ్చిన ఆమె మంగళవారం మండలంలోని కాశీపురం–2, సీతంపేట అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రికార్డులు, సరుకులు స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. ప్రీ స్కూల్ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరడంతో మూడేళ్ల వయసు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, బాలింతలు, గర్భిణులకు సక్రమంగా సకాలంలో పంపిణీ చేయాలన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళులు



రొంగలి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు రొంగలి నారాయణమూర్తి అంత్యక్రియలు మంగళవారం జరిగాయి. అతని భౌతికకాయం వద్ద మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కె.వి.రమణ, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, స్థానిక సర్పంచ్ సోమిరెడ్డి సన్నిబాబు, ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పూలమాలు వేసి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. నారాయణమూర్తి ఎంపీటీసీగా, పీఏసీఎస్ అధ్యక్షుడిగా పనిచేయగా ఆయన భార్య భవానీ కూడా సర్పంచ్‌గా పనిచేశారు. పెద్ద కుమారుడు సంతోష్ అమెరికాలో స్థిరపడగా, చిన్న కుమారుడు అవినాష్(ఐఆర్ఎస్) కస్టమ్స్ అధికారిగా పనిచేస్తున్నారు.

శివాలయానికి మైక్‌సెట్ బహూకరణ

మాడుగుల : మండలంలో సత్యవరంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు మంగళవారం రూ.23 వేల విలువ గల మైక్ సెట్ అందజేశారు. గ్రామానికి చెందిన దివంగత నేత ఇందుకూరి నాగరాజు కోరిక మేరకు మైక్‌సెట్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా పీఆర్‌వో పుట్టా మోహన్‌రావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

నర్సీపట్నం : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కన్నయ్యనాయుడు మాట్లాడుతూ ధర్మసాగరం గ్రామంలోని పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ చేయడం వల్ల అదే పాఠశాలలో చదువుతున్న 6, 7 తరగతుల పిల్లల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఎంపీడీవో ఉషాశ్రీ, వైస్‌ఎంపీపీ తాతబాబు, ఎంపీటీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

ఘనంగా పరిదేశమ్మ పండగ



మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో పరిదేశమ్మ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. సతకంపట్టు వద్ద నుంచి అమ్మవారి ఘటాలు ఉరేగించారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు



సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న జానకీరాంపురం గ్రామస్తులు

గొలుగొండ : జానకీరాంపురంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. సీతారాముల ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఈ ఊరేగింపు నిర్వహించారు. బుధవారం సీతారాముల కల్యాణంతో పాటు, ఐదువేల మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

రావికమతం : మేడివాడలో వారం రోజుల్లోగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మాడుగుల సబ్ డివిజన్ ఏడీఈ సురేష్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన మేడివాడలో లోఓల్టేజీ సరఫరా అవుతున్న 4,5,6 వార్డులలో సర్పంచ్ వజ్రపు లీలా నాగ వెంకట రత్నంశివ కలిసి ఆయన పర్యటించారు. ఇక్కడ 16 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు తెచ్చి అమరుస్తామన్నారు. అప్పలమ్మపాలెంలో చిన్న గాలి వీచినా, వర్షం పడిన కరెంట్ ఉండదని ఆ గ్రామస్తులు ఏడీఈకి తెలిపారు. వారం రోజుల్లో నాణ్యమైన విద్యుత్ అందిస్తామని వారికి ఏడీఈ హామీ ఇచ్చారు.

పీడీపాలెంలో వైద్య శిబిరం

బుచ్చెయ్యపేట : పొట్టిదొరపాలెంలో నల్లమారమ్మ పండగ సందర్భంగా ఎన్ఆర్ఐ ట్రస్ట్ చైర్మెన్ వడ్డి సత్యారావు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 207 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ముఖ్యంగా గుండెపోటుపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి పలువురికి ఈసీజీలు తీశారు. కంటి వైద్య పరీక్షలు,జనరల్ చెకప్‌లు,రక్త పరీక్షలు నిర్వహించారు. ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్య సిబ్బంది పరమేశ్వరరావు, హరి కిషోర్,సుజిత్‌కుమార్, సౌమ్య, హేమంత్, సుజాత, క్రిష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి బీమా నగదు అందజేత



పార్వతికి బీమా నగదును అందిస్తున్న పర్సన్ ఇన్‌చార్జ్ గీతావాణి

కె.కోటపాడు : సభ్య రైతులకు పీఏసీఎస్ ద్వారా బీమాను వర్తింపజేయనున్నట్టు కె.కోటపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ గీతావాణి అన్నారు. కె.కోటపాడు పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన రొంగలి కన్నబాబు ఇటీవల మరణించాడు. దీంతో బీమా కలిగి మరణించిన ఆయనకు రూ.2లక్షల బీమా నగదు మంజూరు అయ్యింది. ఈ నగదును మంగళవారం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ బి.గీతావాణి మృతుడి భార్య పార్వతికి అందించారు. సొసైటీ సీఈవో ఆర్.చిన ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.